AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com
4-11-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

జూదంపై ఉక్కుపాదం..





చెత్తకుప్పపై కూర్చుని కౌన్సిలర్ నిరసన

ఆలూరులో నూతన గ్రంథాలయం ప్రారంభం



అక్షరటుడే, ఆర్మూర్ : ఆలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డితో కలిసి ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్ కుమార్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆలూరు సర్పంచ్ ముక్కెర విజయ్, ఆర్మూర్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా గౌడ్, డీసీసీ కార్యదర్శి సాయినాథ్ గౌడ్, కౌన్సిలర్లు నవీన్, ప్రసాద్, గంగోలి, భూపేంద్ర, ఆర్మూర్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు సారంగి శాంతి కుమార్, గంగాధర్ గౌడ్, సొసైటీ చైర్మన్ అశోక్, గోనె రఘు, దామోదర్, రవి, మురళి, చిట్టి రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

కామారెడ్డి మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం రేపింది. జూనియర్ విద్యార్థులను కొంతమంది సీనియర్లు ర్యాగింగ్ పేరిట వేధించారు. ఐదు రోజుల క్రితం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జూనియర్ విద్యార్థుల పట్ల సీనియర్లు ప్రవర్తిం చిన తీరు చర్చనీయాంశంగా మారింది. దీనిపై బాధిత విద్యార్థుల ఫిర్యాదు మేరకు.. అధికారులు చర్యలు చేపట్టారు. విచారణ చేపట్టి ఘటనకు బాధ్యులైన 14 మంది విద్యార్థులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

- అక్షరటుడే, కామారెడ్డి



మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

■ ఫస్ట్ విద్యార్థులపై వేధింపులు ■ ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు ■ 14 మందిని సస్పెండ్ చేసిన కాలేజీ

కళాశాల ప్రారంభమైన నాలుగేళ్లలో మొట్టమొదటి సారి ర్యాగింగ్ భూతం పడగ విప్పింది. కళాశాలలో మొత్తం 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో డే స్కాలర్‌లో 100 మంది, హాస్టల్‌లో 300 మంది విద్యార్థులున్నారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి ర్యాగింగ్ ఫిర్యాదులు లేకుండా సాఫీగా సాగుతున్న కళాశాలలో ఒక్కసారిగా ఈ ఘటన వెలుగులోకి రావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. మొదటి సంవత్సరం విద్యార్థులను సీనియర్లు ర్యాగింగ్ చేశారన్న ఆరోపణలతో కళాశాలలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కొత్తగా కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులు భయాందోళనలకు గురయ్యారు.

ఎన్‌హెచ్‌ఎం సైట్‌లో ఆన్‌లైన్ ఫిర్యాదు

బాధిత విద్యార్థులు ఎన్‌హెచ్‌ఎం సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా గత నెల 28న ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పేరు బయటపెట్టడానికి ఇష్టపడని విద్యార్థులు ఆన్‌లైన్ వేదికను ఆశ్రయించారని చెబుతున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే కళాశాల యాజమాన్యం అప్రమత్తమైంది. ఉన్నతాధికారులకు సమాచారం చేరడంతో వెంటనే విచారణకు ఆదేశించారు. యాంటీ ర్యాగింగ్ కమిటీ రంగంలోకి దిగి బాధితులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థుల నుంచి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది.

లీక్ వెనుక ఎవరు..

ర్యాగింగ్ విషయం బయటకు ఎలా లీకైంది, ఫిర్యాదు వెనుక ఎవరు ఉన్నారు అనే అంశంపైనా అంతర్గత విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. కళాశాలలో ర్యాగింగ్ నిరోధక చర్యలు ఎంతవరకు పటిష్ఠంగా ఉన్నాయి అనే ప్రశ్నలు కూడా తెరపైకి వస్తున్నాయి. హాస్టల్‌లో, కళాశాల ఆవరణలో నిఘా ఎలా ఉంది, యాంటీ ర్యాగింగ్ సెల్ ఎంత చురుకుగా పనిచేస్తోంది అనే అంశాలపై కూడా విచారణ జరుగుతున్నట్లు సమాచారం. ఈ ఘటన కామారెడ్డిలో కలకలం రేపింది.

14 మంది విద్యార్థులపై సస్పెన్షన్ వేటు

విషయం తెలిసిన వెంటనే విచారణ చేపట్టి ఘటనకు బాధ్యులైన 14 మంది విద్యార్థులపై సస్పెన్షన్ విధిస్తూ చర్యలు తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో ర్యాగింగ్ జరిగినట్లు తేలడంతోనే ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. సస్పెన్షన్‌కు గురైన విద్యార్థులు ఏ సంవత్సరం వారు, వారి పాత్ర ఏంటి అనే వివరాలు మాత్రం ఇంకా అధికారికంగా వెల్లడి కాలేదు. సస్పెన్షన్ కాలం ఎంత, వారిపై తదుపరి చర్యలు ఏముంటాయి అనే దానిపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. ఈ చర్యతో కళాశాలలో ఇతర విద్యార్థుల్లో కూడా భయం మొదలైనట్లు చెబుతున్నారు.



లింగంపల్లి కుర్దును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

అక్షరటుడే, లింగంపేట : లింగంపల్లి కుర్దును జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మండలంలోని లింగంపల్లి కుర్దు, ఎల్లమ్మ తండా పంచాయతీల్లో బుధవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడంతో పాటు, నీటి సంరక్షణ చర్యలను విస్తృతంగా చేపట్టి పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలపాలన్నదే జిల్లా యంత్రాంగం లక్ష్యమని సూచించారు. లింగంపల్లి కుర్దు గ్రామంలో చేపడుతున్న ప్లాస్టిక్ రహిత కార్యక్రమాలు, నీటి సంరక్షణ నిర్మాణాలు, పారిశుద్ధ్య పనులు, వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే తాడ్వాయి మండలంలోని ఎండ్రియాల్, దోమకొండ మండలంలోని గోటిముక్కలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కార్యక్రమాలు చేపట్టామని, తాజాగా లింగంపల్లి కుర్దు గ్రామాన్ని మూడో ప్లాస్టిక్ రహిత గ్రామంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ గిరి, డిప్యూటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సురేందర్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, సర్పంచ్ ప్రత్యూష సాయిరాం పాల్గొన్నారు.



ఆప్తులను కోల్పోయిన సమయంలో అండగా.. 'అన్నపూర్ణ సేవారథం'

అక్షరటుడే, కామారెడ్డి: కుటుంబంలో ఆప్తులను కోల్పోయిన సమయంలో అండగా నిలిచేందుకు జీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ సేవారథం ప్రారంభిస్తున్నట్లు టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆప్తుల అంత్యక్రియల సమయంలో ఇంటికి వచ్చే బంధుమిత్రులకు భోజన ఏర్పాట్లు చేయడం కుటుంబ సభ్యులకు అదనపు భారంగా మారకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ సేవను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ సేవ అవసరమైన కుటుంబాలు జీసీఆర్ ట్రస్ట్‌కు సమాచారం అందిస్తే, అన్నపూర్ణ సేవారథం ద్వారా ఉచితంగా భోజనాన్ని వారి ఇంటి వద్దకే తీసుకువచ్చి అందించనున్నట్లు తెలిపారు. కష్ట సమయంలో కుటుంబాలకు అండగా నిలవడం, వారి ఇబ్బందులను కొంతవరకు తగ్గించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సేవను అవసరమైన ప్రతి కుటుంబం వినియోగించుకోవచ్చని, సమాచారం కోసం 9536000333 నంబర్ ను సంప్రదించాలని సూచించారు. ఈ సేవా కార్యక్రమం గురించి ఇతరులకు కూడా తెలియజేసి అవసరమైన వారికి సమాచారం చేరవేయాలని కోరారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందు ప్రియ, కామారెడ్డి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు, మొదటి వార్డు కౌన్సిలర్ గడ్డమీది మహేష్, తాటి ప్రసాద్, డీసీసీ ఉపాధ్యక్షుడు పంపరి లక్ష్మణ్, సేవాదళ్ నియోజకవర్గం అధ్యక్షుడు మెహర్ బాబాగౌడ్, మాజీ కౌన్సిలర్లు జమీల్, చింతల రవీందర్ గౌడ్, చాట్ల వంశీ, రంగ రమేష్ గౌడ్, మాధవి, శ్రీధర్ రావు, బండారి శ్రీకాంత్, అరవింద్, ఆబిద్, హరీష్, వేణు, ప్రణీత్, ప్రవీణ్, రాహుల్, శశి, పండు శ్రీకాంత్ పాల్గొన్నారు.

కళలకు నిలయం ఇందూరు: ఎమ్మెల్యే ధన్‌పాల్



అక్షరటుడే, ఇందూరు : కళలకు, క్రీడలకు నిలయంగా ఇందూరు నిలుస్తోందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం యువతను అనేక రకాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. ప్రధానంగా 'మై భారత్' పేరుతో యువతలో నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవాభావం పెంపొందించేలా తీర్చిదిద్దుతుందన్నారు. ఇందూరులో పెండింగ్‌లో ఉన్న కళాభారతి, క్రీడా స్టేడియాలను పూర్తి చేయడమే తన లక్ష్యమన్నారు. జిల్లా యువజన అధికారి రమేష్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, తెలంగాణ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ అపర్ణ, బాలభవన్ సూపరింటెండ్ ఉమాబాల, న్యాయ నిర్ణేతలు పుష్ప, శ్వేతా రెడ్డి, సిర్ప లింగం, కోకిల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బయో మైనింగ్‌ను వేగవంతం చేయాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఇంటింటికీ తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ బుధవారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికి తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. ప్రతి రోజు సగటున 600 మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ జరుపుతుండగా, దానిని వెయ్యి మెట్రిక్ టన్నులకు పెంచాలని కలెక్టర్ సూచించారు. డంపింగ్ యార్డు ప్రాంతంలో ఖాళీ స్థలాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పచ్చదనం పెంపొందించాలని అన్నారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డంపింగ్ యార్డు ప్రాంతంతో పాటు నగరంలోని ప్రధాన రహదారులపై ఆవులు, ఇతర పశువులు ఎక్కడబడితే అక్కడ సంచరిస్తుండడం గమనించిన కలెక్టర్ అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై పశువుల సంచారం వల్ల వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.



అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు

అక్షరటుడే,నిజామాబాద్ క్రైం: పగటిపూట ఇళ్లలో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టును నిజామాబాద్ పోలీసులు రట్టు చేశారు. ఈ మేరకు సీపీ సాయిచైతన్య వివరాలు వెల్లడించారు. నవీపేట్ మండల కేంద్రంలో అక్టోబర్ 4న మధ్యాహ్నం వేళ ఓ ఇంట్లో జరిగిన చోరీపై నమోదైన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తుండగా, నిందితులు నిజామాబాద్ వైపు వస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో నవీపేట్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నవీపేట్‌తో పాటు నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని మొత్తం 11 ప్రాంతాల్లో చోరీలు చేసినట్లు నిందితులు అంగీకరించారు. కర్ణాటకలోని యాద్గిర్ ప్రాంతంలో కూడా పలు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. ప్రధాన నిందితుడు సయ్యద్ షకీల్ కారుకు నకిలీ నంబర్ ప్లేట్ అమర్చుకుని వస్తాడు. తాళం వేసిన ఇళ్లలోకి వెళ్లి చోరీకి పాల్పడేవాడు. మిగిలిన ఇద్దరు నిందితులు బయట కాపలా ఉంటూ చుట్టుపక్కల పరిస్థితులను గమనించేవారు. నిందితుల నుంచి 80 గ్రాముల బంగారు ఆభరణాలు, 29 తులాల వెండి వస్తువులు, రూ.5వేల నగదు, హోండా సిటీ కారు, స్వాధీనం చేసుకున్నారు. నవీపేట్ ఎస్సై కే.శ్రీకాంత్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేశారు. సహాయ పోలీస్ కమిషనర్ బి. ప్రకాష్ యాదవ్, నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, సహాయ పోలీస్ కమిషనర్ శ్రీశైలం, ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్, ఇతర సిబ్బంది ప్రతిభను సీపీ అభినందించారు.

తెలంగాణ కళా వైభవాన్ని కాపాడాల్సిన బాధ్యత యువతదే..



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: తెలంగాణ కళా వైభవాన్ని కాపాడాల్సిన బాధ్యత యువతదేనని నగర మేయర్ ఉమారాణి పేర్కొన్నారు. నగరం లోని ఖలీల్‌వాడీలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా యువజన, క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంస్కృతిక ఉత్సవాలను ప్రారంభించారు. మేయర్ ఉమారాణి రమేష్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, తెలంగాణ కళా వైభవాన్ని కాపాడాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. సంస్కృతీ సంప్రదాయాలే సమాజానికి మూలస్తంభాలని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దాగి ఉన్న యువతీయువకుల సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి ప్రభుత్వ కార్యక్రమాలు చక్కటి వేదికగా ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన కళాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిజామాబాద్ జిల్లా ఖ్యాతిని చాటిచెప్పాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారులు, న్యాయనిర్ణేతలు పాల్గొన్నారు.

నల్లూరులో సబ్ కలెక్టర్ పర్యటన



అక్షరటుడే, ముప్కాల్: ముప్కాల్ మండలంలోని నల్లూర్ గ్రామంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామంలో నిర్వహిస్తున్న సర్వే (అనుభవ సర్వే) ప్రక్రియను పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్షించారు. సర్వే సమయంలో రైతులు, భూ యజమానులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. సర్వే పనులు పారదర్శకంగా, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెత్తసేకరణలో నిర్లక్ష్యం.. చెత్తకుప్పపై కూర్చుని కౌన్సిలర్ నిరసన




అక్షరటుడే, కామారెడ్డి: పట్టణంలో చెత్త సేకరణ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దాంతో పట్టణం అంతా దుర్గంధం వెదజల్లుతోంది. స్థానిక కౌన్సిలర్లు, ప్రజలు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో విసుగు చెందిన 46వ వార్డు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ గెరిగంటి లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేస్తూ తన వార్డులో పేరుకుపోయిన చెత్త కుప్పల్లో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. పట్టణాన్ని మున్సిపల్ కమిషనర్ డంపింగ్ యార్డుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించాడు. ఇలాగే కొనసాగితే ప్రజలు అనేక ఇబ్బందులు పడతారని తెలిపారు. కౌన్సిలర్ నిరసన తర్వాత స్పందించిన అధికారులు సుభాష్ రోడ్డులో చెత్త తొలగించినా జీజీహెచ్ వద్ద మాత్రం అలాగే ఉంచారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ నేత ఆధ్వర్యంలో సూపర్ బ్రెయిన్ యోగా



అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ: ఢిల్లీలోని కుతబ్ ఘడ్ ప్రభుత్వ సర్వోదయ కన్య సీనియర్ సెకండరీ విద్యాలయలో సూపర్ బ్రెయిన్ యోగా అంశంపై బుధవారం కార్యశాల నిర్వహించారు. గుంజీళ్ల అంతర్జాతీయ ప్రచారకులుగా పేరొందిన రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత అందె జీవన్ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్ బ్రెయిన్ యోగా వల్ల మెదడు చురుకుదనం పెరిగి జ్ఞాపక శక్తి మెరుగుపడుతుందన్నారు. సూపర్ బ్రెయిన్ యోగా ప్రతినిత్యం చేయడం వల్ల విద్యార్థులలో జ్ఞాపక శక్తి, అభ్యసనం, సృజనాత్మకత, జ్ఞానం, ఏకాగ్రత, గుర్తుంచుకోవడం, సమస్యా పరిష్కారం, వ్యాధి నిరోధక శక్తి మొదలైనవి పెంపొందుతాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులతో 14 రౌండ్లు సూపర్ బ్రెయిన్ యోగా చేయించారు. పాఠశాల ప్రధానాచార్యులు ఇంద్రజీత్ కౌర్ మాట్లాడుతూ విద్యార్థులు సూపర్ బ్రెయిన్ యోగాను ప్రతి రోజు ఆచరిస్తూ మేధో సంపత్తిని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల సందేహాలకు అందె జీవన్ రావు సమాధానాలతో నివృత్తి చేశారు.

ఆర్మూర్‌లో ఏటీఎం చోరీకి యత్నం



అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలో ఏటీఎం చోరీకి దొంగలు యత్నించారు. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలోకి రాత్రివేళ ఇద్దరు దుండగులు ప్రవేశించారు. రాడ్ సాయంతో ధ్వంసం చేశారు. అనంతరం నగదు ఎత్తుకెళ్లేందుకు యత్నించారు. అయితే నగదు ఉన్న బాక్సులు ఓపెన్ కాకపోవడంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. నిందితులు ఏటీఎం ధ్వంసం చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

సరదా కోసం పేకాటకు అలవాటు పడి తర్వాత ఎంతో మంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అప్పుల పాలై రోడ్డున పడుతున్నారు. ఈ క్రమంలో జూదంపై కామారెడ్డి పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. - అక్షరటుడే, కామారెడ్డి



జూదంపై ఉక్కుపాదం..

■ జిల్లాలో నాలుగు ప్రత్యేక బృందాల ఏర్పాటు ■ చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఎస్పీ ఫోకస్
■ నిర్వాహకులు, ఆడుతున్న వారిపై కఠిన చర్యలకు నిర్ణయం

కష్టపడకుండా ఒక్క రాత్రిలో ధనవంతులు కావాలనే అత్యాశతో ఎంతో మంది జూదం వైపు అడుగులు వేస్తున్నారు. మొదట్లో చిన్న మొత్తంతో మొదలయ్యే ఈ ఆట, తర్వాత అప్పులు, కుటుంబ కలహాలు, మానసిక ఒత్తిడి వరకు దారితీస్తోంది.

సంపాదించిన సొమ్మును..

సంపాదించిన సొమ్మును పోగొట్టుకోవడమే కాకుండా, ఉన్న ఆస్తిని, నమ్మకాన్ని, గౌరవాన్ని కూడా కోల్పోతున్నారు. చివరికి ఒంటరితనం, అవమానం మాత్రమే మిగులుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో జూదం, పేకాటను సమూలంగా నిర్మూలించాలని జిల్లా పోలీసు శాఖ నిర్ణయించింది. ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాలతో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు 24 గంటల పాటు జిల్లావ్యాప్తంగా అప్రమత్తంగా ఉంటూ జూదం జరిగే ప్రాంతాలపై నిరంతర నిఘా ఉంచనున్నాయి. ఆకస్మిక దాడులు నిర్వహించి నిర్వాహకులతో పాటు పాల్గొన్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాయి.

అత్యాశతో జీవితాలు నాశనం

కష్టపడకుండా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో కొందరు జూదానికి అలవాటు పడుతున్నారు. జూదంలో గెలిచి సులభంగా డబ్బు వస్తుందనే భ్రమతో కష్టపడి సంపాదించిన సొమ్మును కోల్పోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ వ్యసనంతో కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తి కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. జూదం సంపాదనకు మార్గం కాదని తెలిసినా అదే దారిలో వెళ్తున్నారు.

ప్రత్యేక అడ్డాల ఏర్పాటు

జిల్లాలో ఇటీవల జూదం, పేకాట స్థావరాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. కూలీనాలి చేసుకునే వ్యక్తి నుంచి మొదలుకుని ఉద్యోగుల వరకు దీనికి బానిసలవుతున్నారు. ఈ ఆటను క్యాష్ చేసుకునేందుకు కొందరు ప్రత్యేక అడ్డాలను ఏర్పాటు చేస్తున్నారు. శివారు గ్రామాల్లో ఫార్మ్‌హౌస్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి అందులో సకల వసతులు కల్పిస్తున్నారు. పోలీసులు దాడులకు వస్తున్న సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేక వ్యక్తులను కూడా నియమించుకున్నట్టుగా సమాచారం. ఫలితంగా శివారు ప్రాంతాలు పేకాట స్థావరాలకు అడ్డాగా మారుతున్నాయి.

సమాచారం ఇవ్వాలంటున్న పోలీసులు

జిల్లాలో ఎక్కడైనా జూదం, పేకాట జరుగుతున్నట్లు గుర్తించినా, సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూ నంబర్ 8712686133కు సమాచారం అందించాలని పోలీసు శాఖ పేర్కొంది. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇస్తోంది. జూదం నిర్మూలనలో భాగస్వాములు కావాలని కోరింది.

భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు



యువత జూదానికి బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. జూదం, పేకాట కేసుల్లో పట్టుబడితే ఆ వివరాలు పోలీసు రికార్డుల్లో నమోదవడంతో పాటు వేలిముద్రలు సేకరించి భద్రపరుస్తారు. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు జరిగే పోలీసు వెరిఫికేషన్‌లో ఈ కేసులు పరిశీలనకు వచ్చి ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడుతుంది. – రాజేష్ చంద్ర, ఎస్పీ కామారెడ్డి

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ శుభ్రత పనులు ప్రారంభం



అక్షరటుడే, మెండోరా : పోచంపాడ్ గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ శుభ్రత పనులు ప్రారంభించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో పలుచోట్ల పైపులు కూలిపోయి మట్టి, రాళ్లు, ఇతర వ్యర్థాలతో నిండిపోయాయి. దీంతో మురుగునీరు రోడ్లపైకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం ప్రత్యేక మోటార్ల సహాయంతో డ్రైనేజీలో నిలిచిపోయిన మురుగు నీటిని తొలగిస్తూ, లోపల పేరుకుపోయిన మట్టి, రాళ్లు, వ్యర్థాలను బయటకు తీసే పనులను ప్రారంభించారు. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో దోమలు వ్యాప్తి చెంది డెంగీ, ఇతర అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో దెబ్బతిన్న డ్రైనేజీ వ్యవస్థను గుర్తించి దశలవారీగా శుభ్రత పనులు చేపట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని గ్రామ పంచాయతీ పాలకవర్గం తెలిపింది. సర్పంచ్ మాధురి రాజు, ఉప సర్పంచ్ సంపంగి సతీష్, మిస్పావుద్దీన్, కార్యదర్శి శ్యాం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గుత్ప తండాలో చౌకధరల దుకాణం ప్రారంభం



అక్షరటుడే, ఆర్మూర్: ఆలూరు మండలం గుత్ప తండా ప్రజల చిరకాల సమస్యకు పరిష్కారం లభించింది. గత కొన్నేళ్లుగా తండాలో చౌకధరల దుకాణం లేకపోవడంతో రేషన్ సరుకుల కోసం స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య తెలుసుకున్న వినయ్ కుమార్ రెడ్డి అధికారులతో మాట్లాడి దుకాణం మంజూరు చేశారు. బుధవారం గుత్ప తండా సర్పంచ్ కొర్ర కిషన్ ఆధ్వర్యంలో నూతన దుకాణాన్ని ప్రారంభించారు. గా వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్ప తండా సర్పంచ్ కొర్ర కిషన్, ఉప సర్పంచ్ మహేష్, గుత్ప గ్రామ సర్పంచ్ దశరథ్, శశి మాక్లూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు దయాకర్ రావు అడివి మామిడిపల్లి గ్రామ సర్పంచ్ లతా సాగర్, ఉపసర్పంచ్ చిరంజీవి, రఘు తదితరులు పాల్గొన్నారు.



దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ

అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్ మండలం కల్లడి గ్రామంలో దూడలకు నట్టల నివారణ మందులు వేయించే కార్యక్రమాన్ని సర్పంచ్ గంగోల్ల సుస్మిత ప్రళయ్ తేజ్ ఆధ్వర్యంలో, పశువైద్యురాలు రోజశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రోజశ్రీ మాట్లాడుతూ.. దూడల ఆరోగ్య పరిరక్షణకు నట్టల నివారణ మందులు ఎంతో అవసరమని తెలిపారు. సర్పంచ్ సుస్మిత ప్రళయ్ తేజ్ మాట్లాడుతూ.. గ్రామంలో పశు సంపద అభివృద్ధి, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.



డీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా అదనపు కలెక్టర్ రాజాగౌడ్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాజాగౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. డీసీఎంఎస్ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, రైతులకు సహకార రంగం ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వారికి సూచించారు.



విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

అక్షరటుడే, కామారెడ్డి : ఇందిరాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కామారెడ్డి పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు ఇందిరాగాంధీ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విగ్రహాన్ని ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గోనె శ్రీనివాస్, కౌన్సిలర్లు షేరు, జావిద్, నాయకులు ఇప్ప శ్రీనివాస్, లడ్డు, సిద్ధిక్, అజ్మత్, ఖదీర్, విజయ్, చాట్ల రాజేశ్వర్, కాళ్ల గణేష్, సిరాజ్, లక్కపత్తి గంగాధర్, రామ్మోహన్, సంతోష్, సుధాకర్ రెడ్డి, రెహాన్ పాల్గొన్నారు.

ఆర్ఆర్ చౌరస్తాలో స్కూటీని ఢీకొన్న లారీ.. ఒకరికి గాయాలు



అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: వేగంగా వస్తున్న లారీ స్కూటీని ఢీకొంది. నగరంలోని ఆర్ఆర్ చౌరస్తాలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పూలాంగ్ నుంచి వస్తున్న లారీ ఆర్ఆర్ చౌరస్తా వద్ద స్కూటీని ఢీకొంది. లారీ వేగం ధాటికి స్కూటీ టైర్ల కింద ఇరుక్కుని నుజ్జునుజ్జయ్యింది. దీంతో స్కూటీపై వెళ్తున్న సాయి అనే వ్యక్తికి గాయలయ్యాయి. స్పందించిన స్థానికులు వెంటనే అతడిని జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కౌన్సిలర్ సిద్ధి శ్రీధర్ గుప్తా!

అక్షరటుడే, ఎల్లారెడ్డి: పట్టణంలోని 8వ వార్డులో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని వార్డు కౌన్సిలర్ సిద్ధి శ్రీధర్ గుప్తా నిలబెట్టుకున్నారు. వార్డుకు చెందిన కంట్రపల్లి కిషన్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా, విషయం తెలుసుకున్న శ్రీధర్ గుప్తా మృతుడి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఎన్నికల ప్రచార సమయంలో వార్డులో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియల కోసం రూ.10వేలు అందజేస్తానని ఇచ్చిన హామీ మేరకు ఈ సహాయం చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన శ్రీధర్ గుప్తా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ఆడపిల్ల జన్మిస్తే రూ.11వేలు, ఆడపిల్ల వివాహానికి రూ.10వేల ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతేకాకుండా వార్డు ప్రజల అవసరాల కోసం బాడీ రిఫ్రిజిరేటర్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు రెండు బోర్లు వేయించి విద్యుత్ మోటార్లను సమకూర్చారు.

నాగంపేట్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అక్షరటుడే, ముప్కాల్ : మండలంలోని నాగంపేట్ గ్రామంలో బుధవారం ఉదయం కల్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కులను సర్పంచ్ దాసరి గంగాధర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పంతంగి మదన్, పంచాయతీ కార్యదర్శి మంచిర్యాల కవిత, జీపీవో చందు తదితరులు పాల్గొన్నారు.



ఆలూర్‌లో విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



అక్షరటుడే, ఆర్మూర్ : మండల కేంద్రంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వీడీసీ అధ్యక్షుడు కల్యాణ్ మోహన్ రెడ్డి, సర్పంచ్ ముక్కెర విజయ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో విద్యుత్ సరఫరా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు కల్లెం మోహన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ముక్కెర విజయ్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.